
# మేడిపండు

విన్నకోట సుశీలాదేవి



పర్సనల్ సెక్రెట్రీ జార్జి ఒక్కొక్క ఫైలు తీసి వివరిస్తుంటే సంతకాలు పెడ్తున్నాడు కంపెనీ ఎమ్.డి. సత్యమూర్తి.

'ఇదేమిటి జార్జ్.... ఇక్కడ మన ప్రోడక్టు కలెక్షన్ డబ్బు ఎక్కువగా వుంది! కానీ మన కంపెనీ ఎక్కవుంట్లో జమ అయింది తక్కువగా వుంది. మిగతా డబ్బు ఏవయింది?'

'అవునుసార్... అక్కడొక పొరపాటు జరిగింది! మీకు చెప్పాలనుకుంటూనే వున్నా....' జార్జి నీళ్లు నమిలాడు.

'ఎప్పుడు చెప్పేది.... నా చేత సంతకం పెట్టించాకా?' కోపంగా అన్నాడు సత్యమూర్తి.

'అదికాదు సార్! మీకు విషయం చెప్పాలనే ఆ ఫైలు విడిగా పెట్టాను. కాని దీనిలో ఎలా కల్సిందో......'

'ఈ డబ్బు కలెక్షన్ జరిగి రెండు నెలలయింది. ఇంతవరకు డబ్బు క్రెడిట్ కాలేదు. రెండు నెలల నుండీ మీరంతా ఏం చేస్తున్నారు? నాక్కూడా ఈ విషయం చెప్పలేదు. నువ్వీ విషయంలో ఏం ఏక్షన్ తీసుకున్నావు?' అనడిగాడు సత్యమూర్తి.

'సార్ ఆ ఏరియా మార్కెటింగ్ మేనేజరు చాలా సిన్సియర్ అతడు మన కంపెనీలో చేరి మూడేళ్లయింది ఒక్కరోజు కూడా శెలవు పెట్టలేదు. ఆ ఏరియాలో అతనొచ్చాకే మన ప్రోడక్టు సేల్స్ బాగా పెరిగాయి. అందుకని...." నసిగాడు జార్జి.

"అందుకని.... కంపెనీ డబ్బు వాడుకుంటే చూస్తూ వూరుకుంటావా?"

'లేదు సార్! అతడ్ని నేను తరుచూ అడుగుతూనే వున్నాను. అతను చాలా మంచివాడు సార్. డబ్బు వాడుకున్నందుకు చాలా బాధపడిపోతున్నాడు. త్వరలోనే జమ చేస్తానని ప్రాధేయపడ్డాడు. అంతగా ఇవ్వలేకపోతే.... వచ్చేనెల నుండీ జీతంలో రికవరీ పెడదామనుకుంటున్నా!'

'జీతంలో రికవరీనా! నో.... నో.... ఇటువంటి వ్యక్తుల్ని మనం క్షమించకూడదు. ఇవ్వాళ చెప్పకుండా కంపెనీ డబ్బు వాడుకున్నాడు. రేపింకేమైనా చేస్తాడు.'

'సార్.... అతడు చాలా అమాయకుడు సార్.' జార్జి ప్రాధేయపడ్డాడు.

'జార్జీ! మనకు కావలసింది మంచితనం కాదు. పనిలో సిన్సియారిటీ....'

'అతడు చాలా సిన్సియర్ సార్.... మన కంపెనీ సేల్స్ పెరగడానికి అతడొక కారణం.'

'అలాగా....' సత్యమూర్తి మెత్తబడ్డాడు. ఎమ్.డి. కోపం తగ్గడం చూసి జార్జికి ధైర్యం వచ్చింది.

'అతడిని మీరొక్కసారి చూస్తే.... అతని మంచితనం అర్థమవుతుంది సార్.'

'ఎవరతను?'

'బోసు బాబు.... పిలిపించమంటారా!'

'వూ' అన్నాడు సత్యమూర్తి.

అయిదునిముషాల్లో బోసుబాబు వచ్చి సత్యమూర్తి ముందు చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు.

'సార్! పిలిచారుట!'

'నువ్వేనా బోసుబాబు.'

'అవును సార్! త్వరలోనే ఆ డబ్బు కట్టేస్తాను.'

'యాభై వేలు ఎప్పటికి కడ్తావ్?'

'జీతంలో రికవరీ పెట్టుకోండి సార్.'

'అదిసరే! అసలా డబ్బు స్వంతానికి వాడుకునేటప్పుడు మాకు చెప్పాలా? వద్దా? మేం గమనించే వరకూ మాకు చెప్పలేదు నువ్వు.... ఇది కంపెనీ రూల్స్‌కే వ్యతిరేకం. నీ మీద ఏం ఏక్షన్ తీసుకోవాలి?' మామూలుగా అడిగాడు.

జార్జి చెప్పినట్లు బోసుబాబు అమాయకంగానే వున్నాడు. ఎందుకిలా చేశాడో! ఏం అవసరమొచ్చిందో! అనుకున్నాడు సత్యమూర్తి.

బోసుబాబు దీనంగా చెప్తున్నాడు.

'సార్! నన్ను క్షమించండి. ఇంకెప్పుడూ ఇలా చేయను. ఆ డబ్బు నాకై నేను తీసుకోలేదు. నా భార్య నాకు తెలీకుండా వాడుకుంది. సార్! మీరే నన్ను కాపాడాలి!'

సత్యమూర్తి కాళ్లమీద పడబోయాడు బోసుబాబు

సత్యమూర్తి అతనివైపు చూశాడు. వంగినపుడు చెవి వెనకాల గాటు.

'ఇతడిని ఎక్కడో చూశానే!' అనుకున్నాడు.

అతడి వైపే.... చూస్తూ ఆలోచించసాగాడు.

'సార్! నా భార్య ఒట్టి డబ్బు మనిషి... అక్కడికీ నేను చెప్తునే వుంటా.... శకుంతలా.... మనకున్న దానితో తృప్తి పడాలి' అని. కాని ఆమె వినదు.'

సత్యమూర్తి ఒక్కసారిగా ముందుకు వంగాడు.

'నీ భార్య పేరేమిటి?'

'శకుంతల'

'మీ మామగారి పేరు?'

శ్రీరామ చంద్రమూర్తి

'నువ్వు.... నువ్వు.... శకుంతల మొగుడివా?' ఆశ్చర్యంగా అన్నాడు.

'అవును సార్' శకుంతల మీకు తెలుసా...? 'సార్...?' బోసు బాబు మాట పూర్తి కాకుండానే సత్యమూర్తి సీటులోనుండి విసురుగా లేచాడు.

'గెటవుట్ ఫ్రం హియర్! జార్జ్ ఇతన్ని వెంటనే ఉద్యోగంలో నుండి సస్పెండ్ చెయ్యి' అన్నాడు కోపంగా.

'సార్! ఈ ఉద్యోగం పోతే బతకలేను.... నన్ను సస్పెండ్ చెయ్యకండి... సార్' (బతిమిలాడసాగాడు బోసుబాబు)

'గో....అండ్ డై. జార్జ్... ఇతడిని నా ముందు నుండి పంపెయ్' అన్నాడు సత్యమూర్తి.

జార్జి బోసుబాబుని వెళ్లిపొమ్మని సైగ చేశాడు.

సత్యమూర్తి సీటులో కూర్చుని.... వెనక్కి వాలాడు.

'జార్జ్.... అతడి సస్పెన్షన్ ఆర్డర్ టైపు చేసి పట్టుకురా.... సంతకం పెడతా.'

అప్పటివరకూ ఎంతో బాగా వున్న ఎమ్.డి గారు. హఠాత్తుగా ఎందుకలా మారిపోయారో! బోసుబాబు మీద ఎందుకలా అరిచారో అర్థంకాక సత్యమూర్తి వేపు ఆశ్చర్యంగా చూసి... ఫైల్సు పుచ్చుకుని బయటికు వెళ్లిపోయాడు జార్జి.

సత్యమూర్తి రివాల్వింగ్ ఛెయిర్లో ఇటూ.... అటూ... తిరుగుతూ ఆలోచిస్తున్నాడు.

బోసుబాబు. తన ప్రియమైన శకుంతల భర్త. మూడేళ్ల నుండీ తన దగ్గరే పనిచేస్తున్నా తెలుసుకోలేకపోయాడు. తను పెళ్లాడాలనుకున్న శకుంతలని తనకి కాకుండా చేసిన దుర్మార్గుడు.

అతడిని నాశనం చెయ్యందే తన కసి తీరదు. శకుంతల దూరమవడంతో విరక్తి చెంది పెళ్లే మానుకున్నాడు. బోసుబాబు లేకపోతే తను శకుంతలని పెళ్లి చేసుకుని ఎంతో హాయిగా వుండేవాడు.

వీడిని కేవలం సస్పెండ్ చెయ్యడం కాదు... పోలీసులకు ఫోను చేసి జైల్లో పెట్టించాలి. అప్పటిగ్గానీ తన ఆవేశం చల్లారదు. తన బాధ తీరదు.

శకుంతల.....

అలనాటి కణ్వా శ్రమంలోని శకుంతలలా ఎంతో అందంగా వుండేది. ఆమె అందం - డబ్బు చూసి మాయ మాటలు చెప్పి లోబర్చుకున్నాడు ఈ దుర్మార్గుడు.

అమాయకురాలిని మోసం చేశాడు.

వెధవ... ఇన్నాళ్లకి తన చేతికి దొరికాడు. జార్జి రాగానే పోలీసులకు ఫోను చేయమని చెప్పాలి. అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు.

అతని మనసులో గతం మెదిలింది!

"ఏరా.... సత్యం మా అమ్మాయి శకుంతలని పెళ్లి చేసుకుంటావా? మావయ్య అడిగేసరికి సత్యమూర్తి ఆనందంతో తబ్బిబ్బు పడ్డాడు.

"మావయ్యా! నిజంగానే అంటున్నావా?"

'అవున్రా! చిన్నప్పుడే మీ అమ్మా - నేనూ అనుకున్నాం. మీ ఇద్దరికీ పెళ్లి చేయాలని! మీ అమ్మ పోయినా ఆమెకిచ్చిన మాట ఎలా మర్చిపోగలను. మీ ఇద్దరి చదువులూ అయిపోయినాయి. ఇక మీకు పెళ్లిళ్లు చేసేస్తే మా బాధ్యత తీరిపోతుంది. ఏవంటావ్?' మావయ్య అంటున్నాడు.

తనిక అనేదేముంది. ఇంత అదృష్టం పడ్తుందని కలలో కూడా వూహించలేదు. సన్నగా తెల్లగా జాజి మొగ్గలా వుండే శకుంతల తన భార్య.....

"మావయ్యా! శకుంతలకి ఇష్టమేనా."

"శకుంతల నా మాట కాదనదు. చదువు, ఇల్లు తప్ప మరో ధ్యాస లేని పిల్ల. ఈ కాలం అమ్మాయిల్లా కాదురా! పెద్దలు చెప్పింది కాదనదు.... అది నా పెంపకంలో పెరిగిన పిల్లరా...." మావయ్య గర్వంగా చెప్పాడు కూతురి గురించి.

సత్యమూర్తి ఆ మాటల్తో కలల్లో తేలిపోయాడు. శకుంతల తన మావయ్య కూతురన్న మాటేగానీ ఆమె ఎదురుగా కూర్చుని ఎప్పుడూ మాట్లాడలేదు.

తన తండ్రి పల్లెటూళ్లో టీచరు - మావయ్య హైద్రాబాదులో పెద్ద ఇంజనీరు. హోదా - అంతస్థు - పలుకుబడి వున్నవాడు. మావయ్య ఇంటికి వెళ్లాలంటేనే భయంగా వుండేది.

చిన్నప్పుడే అమ్మ చనిపోతే తన తండ్రే తల్లి బాధ్యత కూడా తీసుకుని తనని ప్రేమగా పెంచాడు. పల్లెటూళ్లో హైస్కూలు చదువైపోయాక - హైద్రాబాద్‌లో కాలేజీలో చేరాడు.

హాస్టల్లో వుండి చదువుకున్నాడు. ఇంటరు - డిగ్రీ అయిదేళ్లల్లో చాలా తక్కువ సార్లు మావయ్య ఇంటికి వచ్చాడు. అప్పుడు కూడా మావయ్యతో మాట్లాడి వచ్చేసేవాడు. మెరుపు తీగలా శకుంతల తళుక్కున మెరుస్తూ అప్పుడప్పుడు కన్పించేది. ఈ అపురూప సౌందర్యవతి. తన మావయ్య కూతురు అనుకుంటూ కాలేజీలో ఫ్రెండ్సుతో గర్వంగా చెప్పుకునే వాడు. మావయ్య కూతురు ఆకాశంలో చందమామ అనుకున్నాడే కానీ అరచేతిలో ఉసిరికాయ అనుకోలేదు.

ఇంటికొచ్చి తండ్రికి మావయ్య అన్న మాటలు చెప్పాడు. కొడుకు సంతోషం చూసి తండ్రి నవ్వుకున్నాడు.

"ముహూర్తం నిర్ణయించి ఉత్తరం వ్రాయమని" తండ్రి హైద్రాబాదుకు ఉత్తరం రాశాడు. 'మావయ్య దగ్గరి నుండి ఎప్పుడు ఉత్తరం వస్తుందా!' అని ఎదురు చూస్తున్నారు తండ్రీ కొడుకులు - కాని ఎక్కువ రోజులు ఎదురు చూడకుండానే ఉత్తరం వచ్చింది. దానిలో నాలుగే వాక్యాలున్నాయి.

"శకుంతల కాలేజీలో చదివే కుర్రాడిని ప్రేమించిందట. అతడినే పెళ్లి చేసుకుంటానని పట్టుబట్టి కూర్చుంది. శకుంతల మనసు తెలుసుకోకుండా నీలో ఆశలు రేపినందుకు క్షమించు.

ఇట్లు

మీ మావయ్య

ఆ ఉత్తరం చదువుకుని భోరున ఏడ్వాలన్పించింది సత్యానికి....

ఆశలన్నీ కుప్ప కూలిపోయాయి.

కొన్ని రోజులు పిచ్చివాడిలా తిరిగాడు. తండ్రి చెప్పిన ధైర్య వచనాలతో మనిషయ్యాడు. చదువే ధ్యేయంగా ఉన్నత స్థానాన్ని పొందడమే లక్ష్యంగా చేసుకుని శ్రమించాడు. వేరే ఆలోచన లేకుండా గమ్యస్థానానికి చేరడానికే తీవ్రమైన కృషి చేశాడు. అనుకున్నది సాధించాడు.

'సార్! ఇదిగోనండీ లెటరు' జార్జి మాటలో ఈ లోకంలోకి వచ్చాడు సత్యమూర్తి.

ఆ కాగితం మీద సంతకం పెడుతుండగా జార్జి అన్నాడు.

'సార్ మరొక్కసారి ఆలోచిస్తారా.'

'నో..... ఇది తీసుకెళ్లి అతనికిచ్చెయ్' జార్జి తీసుకెళ్ళిపోయాడు.

'వాడికీ శిక్ష సరిపోదు.... తన శకుంతలని తనకి కాకుండా చేసినందుకు ఇంకా... ఇంకా ఏడ్వాలి వాడు' అనుకుంటూ పోలీసు స్టేషనుకు ఫోను చేశాడు సత్యమూర్తి.

## భారీ చిత్రాలు



*జూన్ 15వ తేదీన సన్నీడియోల్ నటించిన 'గద్దర్,' అమీర్‌ఖాన్ తను సొంతంగా నిర్మాణం చేపట్టి నటించిన చిత్రం 'లగాన్,' ఒకే రోజున విడుదల అయ్యాయి. 1990లో కూడా సన్నీ డియోల్ నటించిన 'ఘాయల్,' అమీర్‌ఖాన్ నటించిన 'దిల్' ఒకే వారంలో విడుదలయి పెద్ద హిట్ అయ్యాయి. 25 కోట్లతో అమీర్‌ఖాన్, 18 కోట్లతో జీ ఇంటర్నేషనల్ నిర్మించిన 'లగాన్' 'గద్దర్' హిట్ అవుతాయని అంచనా. రెండు భారీ చిత్రాలు ఒకే రోజున విడుదల అవటం బాలీవుడ్‌లో పెద్ద విశేషంగా భావిస్తున్నారు.*



'మీ కోసం ఎవరో లేడీస్ వచ్చారు సార్! పంపించమంటారా..' రిసెప్షనిష్టు ఇంటర్‌కమ్‌లో అడిగింది.

'పంపించు' అన్నాడు సత్యమూర్తి. రెండు నిముషాల తర్వాత తన గదిలోకి అడుగుపెట్టిన స్త్రీని చూసి ఆశ్చర్యపోయాడు సత్యమూర్తి.

'నమస్కారం సార్. నేను బోసుబాబు భార్యను! నా పేరు శకుంతల' అందామె.

శకుంతల.

తను ప్రేమించిన శకుంతల. ఈమెనీ ఆశించి, తపించి.... పెళ్లి కుదరకపోతే పిచ్చివాడై తిరిగిన రోజులు. ఆనాటి సంఘటనలు మనసులో మెదిలాయి.

సన్నగా నాజూగ్గ వుండే శకుంతల లావయింది, తెల్లబడింది, పెద్దముడి వేసుకుంది.... లిప్‌స్టిక్, పట్టుచీర, మెడలో బంగారం తొడుగులు... చూడటానికి అసహ్యంగా వుంది.

కుర్చీ జరుపుకుని కూర్చుంది.

సత్యమూర్తి వేపు క్షణకాలం పరిశీలనగా చూసి "మీరు..... నువ్వు.... నువ్వు..... సత్యమూర్తివి కదూ!' అనడిగింది.

'అవును!'

'నేను.... శకుంతలని, గుర్తుపట్టలేదా?' అంది ఉత్సాహంగా.

'గుర్తొచ్చావులే! ఏమిటిలా వచ్చావు.' అన్నాడు పొడిగా....

"నువ్వు కంపెనీ ఎం.డి.వి అయ్యావా! మా ఆయన బోసుబాబు నీదగ్గరేనా పనిచేసేది."

చాలా కాలం తర్వాత శకుంతలని చూశాననే ఆనందం ఒక ప్రక్క ఆమె బోసుబాబు భార్య అని కోపం ఒక ప్రక్క.... మనసుని పట్టి ఊపుతున్నాయి.

'బోసుబాబు నా దగ్గరే పనిచేసేవాడు.' కసిగా అన్నాడు సత్యం.

'నువ్వింత పెద్ద పొజిషన్‌లోకి ఎలా వచ్చావ్? ఆనాడు మా నాన్న నిన్ను పెళ్లి చేసుకోమని చెప్తే నువ్వు కూడా మీ నాన్నలాగా బడిపంతులివి అవుతావని నేనే వద్దన్నాను. కానీ నువ్వింత పెద్ద ఉద్యోగం చేస్తావని తెలిస్తే ఒప్పుకునేదాన్ని' విచారంగా అంది.

సత్యమూర్తి ఆమె వేపు తెల్లబోయి చూశాడు.

'నువ్వు.... నన్ను..... కాదన్నావా?'

'అవును సత్యం. నిన్ను కాదన్నందుకు అనుభవిస్తున్నాలే! బాగా డబ్బున్నవాడని బోసుబాబుతో నేనే పరిచయం పెంచుకుని, అతడిని ఒప్పించి పెళ్లి చేసుకున్నా... కాని ఏం లాభం వాళ్ల నాన్న కంపెనీ దివాళా తీసింది. డబ్బంతా పోయింది. బోసుబాబు ఉద్యోగం కోసం తిరిగి రెండు మూడు చోట్ల చిన్న ఉద్యోగాలు చేసి చివరకు నీ కంపెనీలో చేరాడు. చాలీచాలని జీతం.... నా బాధలు ఏం చెప్పను. నిన్ను చేసుకున్నా పోయేది.... పెద్ద హోదా... అంతస్తు... దక్కేవి... ప్చ్... దేనికైనా ప్రాప్తం వుండొద్దూ!' 'అన్నట్లు.... నీకు పెళ్లయిందా?' అనడిగింది.

శకుంతల మాటలు వింటోంటే.... అంతవరకూ ఆమెపైనున్న ప్రేమంతా ఆవిరైపోసాగింది... దాని స్థానంలో అసహ్యం, కోపం చోటుచేసుకోసాగాయి.

'బోసుబాబు కంపెనీ డబ్బు వాడుకున్నాడని ఉద్యోగంలో నుండి తీసేశావుటగా.... ఆయనకంతా శాస్తి జరగాల్సిందే!' అంది.

సత్యమూర్తి తెల్లబోయాడు.

కట్టుకున్న మొగుడిని గూర్చి అలా మాట్లాడటం వింతగా తోచింది.

ఎలాగో ఉద్యోగం నిలబెట్టమని ప్రాధేయపడుతుందనుకున్నాడు. కానీ ఉద్యోగం పోయినందుకు సంతోషిస్తుందనుకోలేదు!

"నేనిలా మాట్లాడుతున్నానని ఆశ్చర్యపోతున్నావా? అతని సంగతి నీకు తెలీదు. ఒట్టి పిసినారి. డబ్బు తను సంపాదించలేడు. మా నాన్నని అడగమంటే ఇష్టపడడు. పైగా నీతులొకటి ఎవరికాళ్ల మీద వాళ్లు నిలబడాలి. ఎవర్నీ యాచించకూడదు.... మావగారైనా సరే అడక్కూడదు... అంటాడు. నాకు రవ్వల గాజులు చేయిస్తానని పెళ్లయిన కొత్తలో వాగ్దానం చేశాడు. ఇప్పటివరకూ చేయించలా... అందుకే నాకు ఒళ్లుమండి అతనికి తెలీకుండా కలెక్షన్ డబ్బు తీసి గాజులు చేయించా.. డబ్బు ఖర్చు చేశానని గోల పెట్టేశాడు. లేకపోతే ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు... అంతేకావాలి" అంటోంది శకుంతల.

ఆ మాటలు వింటున్నకొద్దీ సత్యమూర్తి, తల తిరిగిపోసాగింది. ఎవరో పరాయి వ్యక్తిలా భర్తని తిట్టిపోస్తోంది. ఇటువంటి ఆడదానిని ఎక్కడా చూడలేదు. ఇప్పటివరకూ శకుంతల పై రూపాన్ని చూసి మనస్సు కూడా అందంగా వుంటుందని భ్రమపడ్డాడు. అది మేడిపండు వంటిదని ఇప్పుడు తెల్సింది.

'సత్యం. దాహంగా వుంది...' అంది శకుంతల.

సత్యమూర్తి ప్యూనుతో కూల్ డ్రింకులు తెప్పించాడు.

'సత్యం ఆనాడు నిన్ను కాదన్నందుకు బాధపడుతున్నా! నీకిష్టమైతే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం!' అంది ఎంతో తేలిగ్గా.

సత్యమూర్తి కోపంతో మండిపోయాడు. చేతిలో వున్న బాటిల్‌తో ఆమె నెత్తి మీద కొట్టాలన్పించింది.

"శకుంతలా! నాకవతల అర్జంటు పని వుంది నేను వెళ్లాలి!" అన్నాడు.

"వుండు... నేను వచ్చిన పని అవందే!"

"ఏమిటా పని?"

"మా ఆయన్ని సస్పెండు చేశావుగదా! ఇక ఆయన ఆ యాభై వేలు కట్టనక్కర్లేదుగా... ఆ మాట చెప్తే ఆయన వినడం లేదు. ఈ నగలిస్తే అమ్మేసి డబ్బు కట్టేస్తాట్ట.... లేకపోతే పరువు పోతుందిట మనిషికి ప్రాణంకన్నా అభిమానం ముఖ్యమట... చెప్పాగా పైసా సంపాదన లేదుగానీ ఆదర్శాలకేం లోటు లేదు... ఉద్యోగం పోయినా డబ్బు కట్టడం ఎందుకంటే వినడు... అదే అడగాలని వచ్చాను!" అంది.

బోసుబాబు నిజాయితీకి, మంచితనానికి అబ్బురపడ్డాడు. జార్జి చెప్తే నమ్మలేదు. ఆ రోజు జార్జి అడ్డుపడ్డాడు కానీ లేకపోతే ఈపాటికి జైల్లో వుండేవాడు... తనీ రోజు పశ్చాత్తాప పడాల్సి వచ్చేది.

'ఇప్పుడేం చేస్తున్నాడు బోసుబాబు!"

"ప్రస్తుతం యాభైవేలు ఎవరైనా అప్పిస్తారేమోనని చూస్తున్నాడు. మావగార్ని మాత్రం అడగడుట... దానితో పాటు ఉద్యోగం కోసం కూడా ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికి మూడు ఉద్యోగాలు చేశాడు ఇక ఆయనకెక్కడ ఉద్యోగం దొరుకుతుంది లే.... ఆయనకంతే జరగాలి!" మళ్లా భర్తని తిట్టడం మొదలెట్టింది.

మరొక్క క్షణం శకుంతలని భరించలేననుకున్నాడు. ఇంతలో జార్జి వచ్చాడు. సత్యమూర్తికి ప్రాణం లేచివచ్చినట్లయింది.

'మేం మీటింగుకు వెళ్లాలి... ఇక నువ్వెళ్లు' అన్నాడు.

శకుంతల లేచి 'వెళ్లొస్తా సత్యం.' అని బయటికి వెళ్లిపోయింది.

'ఇప్పుడేం మీటింగు సార్.'

'ఆవిడ్ని వదిలించుకోవాలని అన్నాలే... ఇంతకీ ఆవిడెవరో తెలుసా బోసుబాబు భార్య.'

'జార్జ్ బోసుబాబు నాకెంతో మేలు చేశాడు.... అతడెక్కడున్నా పిలిపించి వెంటనే ఉద్యోగంలో జాయినవమను!'

'సార్!'

'అవును జార్జ్. అతనిలాంటి వాడు మన కంపెనీకి చాలా అవసరం.'

'అవును సార్ అతనెప్పుడూ అనేవాడు ఇంట్లో కంటె ఉద్యోగంలోనే మనశ్శాంతి లభిస్తుందని.'

'జార్జ్ ఈవిడ్నెప్పుడూ ఈ కంపెనీలోకి అడుపెట్టనివ్వొద్దని రిసెప్షనిష్టుతో చెప్పు.' వెంటనే వెళ్లి ఆర్డరు టైపు చేసుకురా... తొందరపెట్టాడు.

'సార్‌కు అన్నిటికీ తొందరే... నవ్వుకుంటూ వెళ్లాడు జార్జి. 'బోసుబాబు... ప్చ్.... పూర్ ఫెలో' జాలి పడ్డాడు సత్యమూర్తి! ✻